క్లుప్తంగా

ఇంకుడు గుంతల పరిశీలన



ఇంకుడు గుంతల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న పీడీ గంగాభవాని

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లం గ్రామ సచివాలయంలో రూఫ్ హార్వెస్టింగ్ కుంటలు, బొమ్మన్‌దొడ్ల జగనన్న కాలనీలో ఇంకుడు గుంతలను మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పీడీ గంగాభవాని గురువారం తనిఖీ చేశారు. వర్షపు నీటిని నిల్వ చేసుకోవడం, రూఫ్‌పై నుంచి వచ్చే వర్షపు నీటిని కుంటల ద్వారా నింపాలన్నారు. తద్వారా భూగర్భజలాలను పెంపొందించుకునే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ఈజీఎస్ ద్వారా ఇంకుడు గుంతలు తీయాలన్నారు. ఇంకుడు గుంతలకు ఉపాధిహామీ నుంచి బిల్లులు చెల్లిస్తున్నట్లు చెప్పారు. ఆమె వెంట ఏపీఓ ఇందు, జేఈ మునిరత్నం, టెక్నికల్ అసిస్టెంట్ భూపతి, ఫీల్డ్ అసిస్టెంట్ దామోదరరెడ్డి ఉన్నారు.

భక్తి శ్రద్ధలతో మొహర్రం



ప్రత్యేకంగా అలంకరించి పీర్లు

గంగాధరనెల్లూరు: మండల కేంద్రంలోని అబ్బాస్ కాలనీలో పీర్ల పండుగను ముస్లింలు గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా షియా ముస్లింలు పీర్లను ఊరేగించారు. అబ్బాసియా కమిటీ ఆధ్వర్యంలో మతు గురువులు గ్రామంలోని యువత అధ్యక్షతన పీర్లను ప్రత్యేకంగా పుష్పాలతో అలంకరించారు. మొహర్రం వేడుకలను తిలకించేందుకు పలు గ్రామాల నుంచి ప్రజలు అధికసంఖ్యలో తరలివచ్చారు.

వేరుశనగ సాగులో సస్యరక్షణ తప్పనిసరి



రైతులకు శిక్షణ ఇస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు

పెనుమూరు(కార్వేటినగరం): వేరుశనగ సాగులో సస్యరక్షణ తప్పనిసరి అని జిల్లా వ్యవసాయ సంచాలకులు నాగపద్మిని అన్నారు. గురువారం మండల పరిధిలోని పెనుమూరు మండల కేంద్రంలో వివిధ పంటలో సమగ్ర సస్యరక్షణ పద్ధతులపై అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజిమెంట్ ఏజెన్సీ చిత్తూరు వారి సౌజన్యంతో జిల్లా వ్యవసాయ వనరుల అధికారుల ఆధ్వర్యంలో రైతులకు ఒక్కరోజు శిక్షణ కల్పించారు. ఈ సందర్భంగా ఏడీ నాగపద్మిని మాట్లాడుతూ వరి, వేరుశనగ, కూరగాయల పంటలలో విత్తన శుద్ధి మందులు ట్రైకోడెర్మా విరిడి వాడకం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. అలాగే రక్షక పంటలు, లింగాకర్షక ఎరలు, పసుపు, నీలి రంగు, జిగురు అట్టలు, పక్షిస్థావరాలు, వేపగింజల కషాయం తయారీలపై శిక్షణ కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కల్యాణ్‌బాబు, రైతు భరోసా సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

గడప గడపలో సంక్షేమ పథం

దీర్ఘకాలంగా ప్రజలకు గుదిబండగా ఉన్న సమస్యలన్నింటికి 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం చక్కని పరిష్కారం చూపుతోంది. ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు గత ఏడాది ప్రతిష్టాత్మకంగా ప్రారంభమైన ఈ కార్యక్రమం ప్రజలకు వరప్రదాయినిగా మారింది. ప్రతీ గడపలో సంక్షేమాన్ని నింపడంతో పాటు అభివృద్ధికి ఆస్కారం కల్పిస్తోంది. దీంతో పల్లె, పట్టణం అనే తేడా లేకుండా ప్రతి సచివాలయానికి ప్రభుత్వం రూ.20 లక్షలు నిధులు కేటాయించి సమస్యల పరిష్కరిస్తుండడంతో జనం ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- పల్లెలు, పట్టణాల్లో సీసీరోడ్లు, డ్రైనేజీ, తాగునీటి పైపులైను పనుల పరిష్కారం
- ఏళ్లుగా పరిష్కారం కాని వాటికి కూడా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో చెక్
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



ఎస్ఆర్ నగర్‌లో నిర్మించిన కల్వర్టు



తాగునీటి కొళాయి వద్ద నీరు పట్టుకుంటున్న మహిళ

నగరి : నియోజకవర్గంలో మంత్రి ఆర్‌కే రోజా, అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలో వెలుగులోకి వచ్చిన సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టారు. గ్రామ/వార్డు సచివాలయానికి ప్రభుత్వం రూ.20 లక్షల చొప్పున అదనపు నిధులను మంజూరు చేస్తోంది.
ఇవి చాలకపోతే ఎమ్మెల్యే కోటాలో నిధులను కేటాయిస్తున్నారు. అంతకన్నా మించిపోతే కలెక్టర్ కోటాలో నిధుల కోసం ప్రతిపాదనలు పంపుతున్నారు. ప్రధానంగా క్షేత్రస్థాయిలో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, రక్షణగోడలు, శానిటేషన్, సీసీ రోడ్లు, లింక్ రోడ్లు తదితర మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నారు. మంత్రి ఆర్‌కే రోజా అన్ని శాఖల అధికారులతో కలిసి గడప గడపకు తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారు.

ఏళ్లనాటి రోడ్డు, తాగునీటి సమస్యకు మోక్షం..



పద్మావతినగర్‌లో కొత్తగా వేసిన రోడ్డు



మా వార్డులో రోడ్డు, తాగునీటి సమస్యకు గడపగడపకు కార్యక్రమం తరువాత పరిష్కారం దొరికింది. గత ముప్పై ఏళ్లుగా ఈ సమస్య ఉంది. గతంలో ఎన్నోసార్లు ఈ సమస్యపై పోరాడినా పరిష్కారం దొరకలేదు. మంత్రి ఆర్కేరోజా గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మా వార్డుకు వచ్చిన సమయంలో మా సమస్యను కౌన్సిలర్ ద్వారా ఆమెకు చెప్పుకున్నాం. రోడ్డు, కల్వర్టు పనులకు రూ.8.5 లక్షలు, పైపులైన్ పనులకు రూ.1.5 లక్షలు, మొత్తం రూ.10 లక్షలు మంజూరు చేశారు. వెంటనే నీటి పైపుల పూడిక పనులు, సిమెంటు రోడ్డు ఏర్పాటు అయిందని పద్మావతి నగర్‌కు చెందిన గంగాభాను సంతోషాన్ని వ్యక్తం చేస్తోంది.

కల్వర్టు సమస్య తీరింది..





పాతభజనగుడి వీధిలో వేసిన సిమెంటు రోడ్డు

నా పేరు రాజకుమారి. మేము మహాత్మా నగర్ పరిధిలో మా వార్డు ఎస్ఆర్ నగర్, మహాత్మానగర్‌లో కల్వర్టులు శిథిలమవడంతో మురుగు ముందుకు సాగని పరిస్థితి ఉండేది. అలాగే పాతభజన గుడి వీధిలో రోడ్డు, కాలువల సమస్య ఉండేది. అయితే మంత్రి ఆర్కేరోజా మా ప్రాంతంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించే సమయంలో సమస్యను ఆమె దృష్టికి తెచ్చాం. రూ.30 లక్షలు నిధులు మంజూరు చేశారు. పాత కల్వర్టులు తొలగించి నూతన కల్వర్టులు నిర్మించడంతో పాటు సిమెంటు రోడ్లు, కాలువలు నిర్మించారు. ప్రస్తుతం సమస్యలు పరిష్కారమయ్యాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మురుగు సమస్యకు చెక్..





నింద్ర: అత్తూరు ఎస్టీకాలనీలో నిర్మించిన మురుగు కాలువలు

నింద్ర మండలం అత్తూరు ఎస్టీ కాలనీలో మురుగు కాలువల సమస్య, అత్తూరు గ్రామంలో రోడ్డు సమస్య చాలారోజులుగా ఉంది. ఈ కారణంగా అవస్థలు పడేవాళ్లం.అయితే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ఈ సమస్యకు పరిష్కారం లభించింది. ఈ కార్యక్రమంలో భాగంగా మంత్రి ఆర్కేరోజా మా ఇళ్ల వద్దకు వచ్చిన సమయంలో మా సమస్యను విన్నవించుకున్నాం . వెంటనే రూ.8 లక్షలు మురుగు కాలువల నిర్మాణానికి, రూ.7 లక్షల సిమెంటు రోడ్డుకు నిధులు మంజూరు చేశారు. ఆ నిధులతో కాలువలు, రోడ్డు నిర్మించారంటూ అత్తూరు గ్రామస్తుడు రమేష్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చెప్పిన వెంటనే పరిష్కారం..





కీళపట్టులో నూతనంగా నిర్మిస్తున్న సిమెంటు రోడ్డు

మా గ్రామంలో పడవేటమ్మ గుడి వీధి అధ్వానంగా ఉండేది. చిన్న వర్షం పడ్డా బురద అయ్యేది. పిల్లలు, వృద్ధులు నడవడానికి చాలా ఇబ్బంది పడేవారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విచ్చేసిన మంత్రి దృష్టికి మా సమస్యను తీసుకెళ్లాం. చెప్పిన వెంటనే రూ.4.50 లక్షలు మంజూరు చేశారు. సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి అయిందని కీళపట్టు పడవేటమ్మ వీధికి చెందిన సెల్వి సంతోషం వ్యక్తం చేస్తోంది.

'గడప గడపకు'లో సమస్యలు పరిష్కారం



గొడుగుమానుపల్లి వద్ద ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్న విద్యుత్ అధికారులు

పెనుమూరు(కార్వేటినగరం) : గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇచ్చిన హామీలను నెరవేర్చిన డిప్యూటీ సీఎం నారాయణస్వామికి ఎప్పటికీ రుణపడి ఉంటామని గొడుగుమానుపల్లి గ్రామస్తులు అన్నారు. డిప్యూటీ సీఎం ఇచ్చిన హామీ మేరకు గురువారం విద్యుత్ అధికారులు గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గతంలో ఎన్నో ప్రభుత్వాలను చూశామని, కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక, ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి మా సమస్యలను తెలుసుకుని పరిష్కరించడంలో ఎంతో చొరవ చూపుతున్నారని కొనియాడారు. వారంలోపే పులికల్లు సచివాలయ పరిధిలోని గొడుగుమానుపల్లి, కలికిరి సచివాలయ పరిధిలోని చిన్నకలికిరి జగనన్న కాలనీలో 30 విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ లైన్లు వేయించిన ఘనత డిప్యూటీ సీఎంకే దక్కిందన్నారు. అదేవిధంగా సీఆర్ కండ్రిగ, ఎల్కేపీ ఊరు, ఎస్టీ కాలనీల్లో 19 విద్యుత్ స్తంభాలను వేగవంతంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ డిప్యూటీ సీఎం నారాయణస్వామికి తాము ఎప్పటికీ రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో ఏఈ నీరజ, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు యశోదారెడ్డి, ఏఎంసీ చైర్మన్ బండి కమలాకర్‌రెడ్డి, సర్పంచ్ తంగవేలు, ఎస్సీసెల్ కార్యదర్శి దాము, రమేష్ పలువురు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

నగరి : పీసీఎన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న హిస్టరీ, సివిక్స్ (తమిళం) గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ కె.వెంకటాచలపతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ సర్టిఫికెట్లతో ఈ నెల 25వ తేదీన జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. వివరాలకు 9490504730 నంబరులో సంప్రదించాలని కోరారు.

నేడు వరలక్ష్మీవ్రతం

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎన్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా చవటగుంటలో నందీశ్వర ఆలయం, నరసింహస్వామి ఆలయం, ద్రౌపదీ సమేత ధర్మరాజులు ఆలయాల్లో ప్రత్యే పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

అన్ని వర్గాల ప్రజలను ఆదుకుంటున్నాం



పొన్నియమ్మ గుడివీధిలో లబ్ధిదారుకు బుక్‌లెట్ అందిస్తున్న మంత్రి ఆర్‌కే రోజా

- ప్రాధాన్యం ఉన్న ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నాం
- తద్వారా సమస్యలకు చెక్ పెడుతున్నాం
- ఎక్కడ అభివృద్ధి పనులు చేపట్టాలో గుర్తించడానికే గడపగడపకు వెళ్తున్నాం
- మంత్రి ఆర్‌కే రోజా

నగరి : అన్ని వర్గాల ప్రజలను ఆదుకుంటున్నామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. మున్సిపల్ పరిధిలోని కేవీపీఆర్ పేటలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆమె నిర్వహించారు. స్థానికులు గజమాలలు, దుశ్శాలువలతో హారతులు పట్టి ఆమెను ఆహ్వానించారు. మండలస్థాయి అధికారులతో కలసి ప్రతి గడపకు పర్యటించిన ఆమె నాలుగేళ్లలో ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని నివాసితులకు వివరిస్తూ సంక్షేమ బుక్‌లెట్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని విధాలుగా ప్రజలకు అండగా నిలుస్తున్నామని తెలిపారు. కేవీపీఆర్ పేట సచివాలయ పరిధిలో ఇప్పటివరకే రూ.35 లక్షల మేర రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడం జరిగిందన్నారు. పలు ప్రభుత్వ పథకాల ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని తెలిపారు. ఈ ప్రాంతంలోని మరమగ్గ కార్మికుల సంక్షేమానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నానని అన్నారు. తాము చేపడుతున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమం రికార్డు పూర్వకంగా చెప్పగలమని గత పద్నాలుగేళ్ల పాలనలో టీడీపీ తాము చేసిన అభివృద్ధి పనులు చెప్పగలదా అన్నారు. ఎవరు మంచి చేస్తున్నారో ప్రజలు గ్రహిస్తున్నారన్నారు. అండగా నిలిచేదెవరో అవసరాల కోసం వచ్చేదెవరో వారికి తెలుసన్నారు. ప్రతి గడపలో లభించే ఆధరణే అందుకు నిదర్శనమన్నారు. 2024లో జరిగే ఎన్నికల్లోను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయఢంకా మోగించడం ఖాయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నీలమేఘం, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, మున్సిపల్ పార్టీ కన్వీనర్ బీఆర్వీ అయ్యప్పన్, మున్సిపల్ సచివాలయ కన్వీనర్ దయానిధి, మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, కౌన్సిలర్లు గంగాధరం, మురుగ, ఏజీ సంపూర్ణమ్మాళ్, ఏజీ మణి, ఏజీ భాస్కర్, మెప్మా టీఎల్ఎం సునీత, హౌసింగ్ ఏఈ భాస్కర్, పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ పట్టాదారులపై కేసులు పెట్టండి

–ఆర్డీఓ చంద్రముని



ఇందిరానగర్‌లో రోడ్డును పరిశీలిస్తున్న ఆర్డీఓ

వరదయ్యపాళెం: నకిలీ పట్టాలతో భూఆక్రమణలకు పాల్పడుతున్న వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని ఆర్డీఓ చంద్రముని, తహసీల్దార్‌ను ఆదేశించారు. గురువారం ఇందిరానగర్, గోపాలరావుకాలనీలలో ఆక్రమణలకు గురువుతున్న భూములను ఆయన పరిశీలించారు. క్షేత్రస్థాయిలో వీఆర్వోలు విచారణ చేసి నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేయాలన్నారు. అలాగే మండల పరిషత్ కార్యాలయాల మీదుగా ఇందిరానగర్, పద్మావతి పురం గ్రామస్తులకు ప్రభుత్వ కార్యాలయాల సముదాయం వైపుగా గతంలో ఉన్న దారిని యథావిధిగా కొనసాగించేందుకు స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ నిర్వహించారు. అయితే ప్రభుత్వ భూముల్లో అనుమతి లేకనే కట్టడాలు నిర్మించడంపై ఆర్డీఓ ప్రశ్నించారు. ప్రజా అవసరాలకు దారి అవసరమైతే పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఫిర్యాదుదారునికి హామీ ఇచ్చారు. తహసీల్దార్ గౌరిశంకరరావు, సర్వేయర్ రమణ, ఆర్ఐ వెంకటరమణ పాల్గొన్నారు.

చంద్రయాన్.. మేరా భారత్ మహాన్



సంబరాలు చేసుకుంటున్న జెడ్పీటీసీ, అధికారులు



కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న నగరి ప్రజలు

శ్రీరంగరాజపురం: చంద్రయాన్–3 జాబిల్లిపై విజయవంతంగా అడుగుపెట్టి సరికొత్త చరిత్రను సృష్టించిందని జెడ్పీటీసీ సభ్యుడు రమణప్రసాద్‌రెడ్డి అన్నారు. చంద్రుని దక్షిణ ధ్రువంపై సురక్షితంగా విక్రమ్ ల్యాండర్ దిగడంతో ప్రపంచంలోనే మొట్టమొదటి దేశంగా భారత్ చరిత్ర పుటల్లోకి ఎక్కిందన్నారు. చంద్రయాన్ విక్రమ్ ల్యాండర్ విజయవంతంపై గురువారం మండల కేంద్రంలో అధికారులతో కలిసి కేక్ కట్ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇస్రో శాస్త్రవేత్తల నిర్విరామ కృషి దేశానికి తలమానికంగా మారిందన్నారు. దేశానికి వన్నె తెచ్చిన శాస్త్రవేత్తలకు యావత్ భారతావని సెల్యూట్ చేస్తున్నట్లు అభివర్ణించారు. చంద్రయాన్–3 విజయవంతంతో అభివృద్ధి చెందిన దేశాలతో భారత్ పోటీ పడుతోందనడంలో సందేహం లేదన్నారు. ప్రపంచంలో ఏదేశం సాధించని విజయాన్ని ఇండియా అందుకోవడం ప్రతి భారతీయుడు గర్వపడాల్సిన సమయం ఇదే అని అధికారులు అన్నారు. ప్రతి భారతీయుడు కూడా మేరా భారత్ మహాన్ అని గర్వంగా చెప్పుకునే సందర్భం ఇదే అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ లోకనాథపిళ్లై, ఎంపీడీఓ కృష్ణయ్య, మండల కన్వీనర్ మణి, ఎన్నారై సైంటిస్ట్ భాస్కరరెడ్డి(స్విట్జర్లాండ్), ఎస్‌ఐ షెక్షావలి, నాయకులు గోవిందయ్య, లోకనాథరాజు, భూపతిరెడ్డి, యేసయ్య, రామచంద్రయాదవ్, బాబు పాల్గొన్నారు.

నగరిలో..

నగరి : చంద్రయాన్ విజయవంతం కావడంపై నగరి పట్టణానికి చెందిన పలువురు సంబరాలు చేసుకున్నారు. కేక్ కట్ చేసి అందరికీ అందిస్తూ తమ ఆనందాన్ని పంచుకున్నారు. చంద్రయాన్ విజయం ప్రపంచమంతా భారతదేశంవైపు చూసేలా చేసిందన్నారు. ఇది ప్రతి భారతపౌరుడు గర్వించదగ్గ అంశమంటూ కొనియాడారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ఎ.మోహన్, సురేష్, మనోహర్, కుమార్, శ్రీధర్, శేఖర్, శరవణ తదితరులు పాల్గొన్నారు.

హంస వాహనంపై ద్రౌపదీదేవి



సైంధవ రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

పుత్తూరు రూరల్: పట్టణంలోని ద్రౌపదీదేవీ సమేత ధర్మరాజులస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి హంస వాహనంపై ద్రౌపదీదేవి సమేత అర్జునస్వామి తిరువీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఇంటింటా భక్తులు కర్పూర హారతులు ఇచ్చారు. ఉదయం 6 గంటలకు స్థానిక మంచినీళ్ల గుంట నుంచి సంరక్షకుడిగా పోతురాజు ముందు నడుస్తుండగా గెరిగె ఆలయానికి చేరుకుంది. గెరిగె నీటితో అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను విశేష అలంకరణలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం 5 గంటలకు సైంధవ రథోత్సవం, 6 గంటలకు తవణం పల్లకి ఉత్సవం నిర్వహించారు. రాత్రి 8గంటలకు గెరిగె ఊరేగింపుగా ఆలయానికి చేరుకోవడంతో, ద్రౌపదీ సమేత అర్జున స్వాములను సర్వాంగ సుందరంగా అలంకరించి హంస వాహనంపై కొలువుదీర్చారు. బీసీరాజా కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఊరేగింపు జరిగింది. రాత్రి 9 గంటలకు ఆర్.నాగమునిరెడ్డి ఆధ్వర్యంలో సింహ వాహనంపై స్వామి, అమ్మవారు పురవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ చైర్మన్ లారీమోహన్, సభ్యులు ముకుందప్రకాష్, సెల్వరాజ్‌పిళ్లై, మునిరాజ, లక్ష్మీసుధ, నిర్మల, మహాదేవి, ఆలయ అర్చకులు హిమాచలంబాబు,మోహన్,మహేష్ పర్యవేక్షించారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు..

శుక్రవారం ఉదయం 6 గంటలకు గెరిగె ఊరేగింపు. 7 గంటలకు పట్టణంలోని ఈశ్వరాలయం నుంచి పార్వతీ పరమేశ్వర్లు నంది వాహనంపై ద్రౌపదీదేవి ఆలయానికి ఊరేగింపు. అర్జునుడికి పాశుపతాస్త్రము నొసంగుట. ఉదయం 10 గంటలకు అర్జునుడు తపస్సుమాను అధిరోహించి భక్తులకు ప్రసాదం అందజేయడం జరుగుతుంది. అనంతరం రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణ సర్వభూపాల వాహన ఉత్సవం. సాయంత్రం 4 గంటలకు ఉత్తర గోగ్రహణం. రాత్రి 9 గంటలకు రైల్వేస్టేషన్ వద్ద బాణసంచా వేడుక, పాటకచేరి ఉంటుంది.